క్లుప్తంగా

నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో ఎస్‌ఐ

దౌల్తాబాద్‌: మండలంలోని చంద్రకల్‌ గ్రామంలో చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.4.50లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తనిఖీలు చేపట్టిన పోలీసులకు కర్నాటక రాష్ట్రం షాపూర్‌కు చెందిన నాగేంద్రప్ప వ్యాపారం నిమిత్తం రూ.4.50లక్షలతో హైదరాబాద్‌ వెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ రమేష్‌కుమార్‌ తెలిపారు. ఇప్పటివరకు చెక్‌పోస్టు వద్ద రూ.27లక్షల98వేలు నగదు పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

81 కేసులు నమోదు

అనంతగిరి: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో బుధవారం నాటికి మొత్తం 81 కేసులకు గాను ఎలాంటి ఆధారాలు లేని రూ. 1,77,98,061 నగదును సీజ్‌ చేయడం జరిగిందని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు.

రేపు సంతోషి మాత ఆలయ వార్షికోత్సవం



సంతోషిమాత అమ్మవారు

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణం శివరాంనగర్‌లో వెలసిన శ్రీ సంతోషిమాత ఆలయం 29వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 8 గంటలకు పుణ్యాహావచనం, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు ఉంటాయన్నారు. 9 గంటల నుంచి భగవద్గీత, విష్ణు సహస్రనామ, హనుమాన్‌ చాలీసా పారాయణం కొనసాగుతుందన్నారు. 12 గంటలకు అమ్మవారికి ప్రత్యేక మహామంగళ హారతి అనంతరం తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అనంతరం ప్రత్యేక ధార్మిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

దోమ : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శ్రీసాయి గణేశ్‌ ఫంక్షన్‌ హాల్‌లో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త సమష్టిగా గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని దిశనిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అడగాలని సూచించారు. కాంగ్రెస్‌ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీతో మోసపోవద్దన్నారు. గ్రామీణ ప్రాంతా ప్రజలందరూ బీఆర్‌ఎస్‌ పార్టీ వైపే ఉన్నారని అన్నారు. పరిగి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు భారీ మెజార్టీ ఇచ్చేలా కార్యకర్తలు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్‌ ఎంపీపీ మల్లేశం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌ రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్‌, కో ఆప్షన్‌ సభ్యుడు ఖజపాష, మాజీ ఎంపీపీ రాజగోపాలచారి, ఎంపీటీసీ రాఘవపురం రాములు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

కోరం లేక సమావేశం వాయిదా

తాండూరు రూరల్‌: తాండూరు మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. బుధవారం ఎంపీపీ అనితాగౌడ్‌ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. అయితే కోరం లేకపోవడంతో సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మరోసారి సమావేశం తేదీ ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

‘పైలట్‌’కే మా మద్దతు

- జాతీయ పార్టీలను నమ్మి మోసపోం
- ప్రాంతీయ పార్టీలతోనే మా పయనం
- బీసీ సంఘం జాతీయ కార్యవర్గసభ్యుడు రాజ్‌కుమార్‌



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్‌

తాండూరు టౌన్‌: తాండూరులో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి పైలట్‌ రోహిత్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్‌ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌ కృష్ణయ్య ఆదేశాలతో రోహిత్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నామని తెలిపారు. తాండూరులో బీసీ ఇంటిగ్రేటెడ్‌ భవన నిర్మాణానికి రెండెకరాల భూమితో పాటు రూ. 2 కోట్ల నిధులు ఎమ్మెల్యే రోహిత్‌ రెడ్డి కేటాయించారన్నారని తెలిపారు. జనగణనతో పాటు కులగణన చేపట్టాలని, చట్టసభల్లో బీసీలకు 50 శాతం సీట్ల కేటాయింపుపై మద్దతు ఇవ్వాలని, కేంద్రంలో ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్‌, బీజేపీ మద్దతు ఇవ్వా లని కోరితే స్పందించలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని ముఖ్యమంత్రిని చేస్తామని ఆ పార్టీ నేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. రోహిత్‌రెడ్డికి మద్దతుగా గ్రామాల్లో ప్రచారంలో పాల్గొంటామని, రెండోసారి ఆయనను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ప్రకటించారు.

ఖండించిన బీసీ నాయకులు

తాండూరు టౌన్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి పైలట్‌ రోహిత్‌రెడ్డికి బీసీ సంఘం మద్దతు ప్రకటించడాన్ని బీసీ నాయకులు ఖండించారు. బుధవారం స్థానిక సమద్‌ ఫంక్షన్‌ హాల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుల సంఘాలు, రాజకీయాలకు అతీతంగా ఉండాలని బీసీ నాయకులు సూచించారు. బీసీ సంఘంలో అనేక పార్టీలకు చెందిన వ్యక్తులు ఉంటారని, వారి మనోభావాలు దెబ్బతినే విధంగా రోహిత్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించడం సబబు కాదన్నారు. బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్‌ తన ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు ఉత్తంచంద్‌, ప్రభాకర్‌ గౌడ్‌, నీరజ, నర్సింహులు, వేణుగోపాల్‌, మల్లేశ్‌, తాండ్ర రాకేశ్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలి

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: పాలస్తీనాపై ఇజ్రాయిల్‌ దురహంకార దాడులను ఆపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య అన్నారు. పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలని సంఘీభావం ప్రకటిస్తూ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా బుధవారం పరిగి బస్టాండ్‌ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలస్తీనా సర్వభౌమత్వాన్ని కాపాడాలని కోరారు. ఇజ్రాయిల్‌ సాగిస్తున్న జాతి అహంకారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆ దేశంలో మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఎంతో మంది మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు ఆపాలని ఐక్యరాజ్య సమితిలో 140 దేశాలు తీర్మానం చేస్తే అందులో భారతదేశం పాల్గొనకపోవడం బాధాకరమని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సత్తయ్య, రఘురాం, లాలయ్య, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పరిశీలకుడి పర్యటన



గురునాథ్‌రెడ్డిని కలిసిన సెల్వరాజ్‌

కొడంగల్‌ : కాంగ్రెస్‌ పార్టీ అధిష్టానం నియమించిన నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు సెల్వరాజ్‌ బుధవారం కొడంగల్‌లో పర్యటించారు. కొడంగల్‌, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌, మద్దూరు, కోస్గి మండలాల్లో పర్యటించి కాంగ్రెస్‌ పార్టీ పరిస్థితిని పరిశీలించారు. కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ పోటీ చేస్తున్న నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరుకు చెందిన తాను కొడంగల్‌ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా నియమించినట్లు చెప్పారు. అన్ని మండలాల్లో పర్యటించి పార్టీ అధిష్టానానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. కొడంగల్‌కు వచ్చిన ఆయన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సోమశేఖర్‌, ఆసీఫ్‌ఖాన్‌, ముస్తాక్‌ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడుదాం



గొరిగడ్డతండాలో ప్రచారం చేస్తున్న నేతలు



యాలాల: మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి



కొడంగల్‌ : కండువా కప్పుతున్న తిరుపతిరెడ్డి

- కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి మనోహర్‌రెడ్డి

యాలాల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీకి చరమగీతం పాడదామని కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని జుంటుపల్లి, పగిడిపల్లి, అక్కంపల్లి, చెన్నారం, దౌలాపూర్‌, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్‌ పార్టీ హయాంలో ప్రతి గ్రామంలో పేదోడికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్య శ్రీ, పింఛను, ఉద్యోగ అవకాశాలను కల్పించారన్నారు. గతంలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జంబో డీఎస్సీ నిర్వహించారని, ప్రస్తుత బీఆర్‌ఎస్‌ హయాంలో ఒక్క ఉద్యోగ కల్పనకు అపసోపాలు పడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, పెద్దేముల్‌ జెడ్పీటీసీ ధారాసింగ్‌, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, కమాల్‌పూర్‌ సర్పంచ్‌ బస్వరాజ్‌, అక్కంపల్లి, ముద్దాయిపేట ఎంపీటీసీలు మాణిక్యమ్మ, దేవగారి రాములు నాయకులు రాకేష్‌ మహారాజ్‌, రాజేందర్‌ రెడ్డి, మైనోద్దీన్‌, కమ్మరి శేఖర్‌, చెన్నారం మల్లప్ప తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి

కుల్కచర్ల : కాంగ్రెస్‌ మేనిఫెస్టోలోని ఆరు గ్యారంటీ పథకాలే తమ అభ్యర్థులను గెలిపిస్తాయని డీసీసీ ఉపాధ్యక్షుడు బీంరెడ్డి, మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని గొరిగడ్డతండా, అనంతసాగర్‌, చిన్నరామయ్యతండాలో పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పార్టీ ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తుందన్నారు. దళితబంధు, బీసీ బంధును తీసుకువచ్చి కేవలం ఆపార్టీ కార్యకర్తలకే ఇచ్చిందని ఆరోపించారు. ప్రజలు బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. పరిగి కాంగ్రెస్‌ అభ్యర్థి టి. రామ్మోహన్‌రెడ్డిని గెలిపించునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి గెలిస్తేనే సమస్యలు పరిష్కారం

కొడంగల్‌ : రేవంత్‌రెడ్డి కొడంగల్‌ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సమస్యలు పరిష్కారమవుతాయని కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్‌ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నియోజకవర్గ సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్‌ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని రేవంత్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్‌, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌, సర్పంచు వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల కమిటీ మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ గుప్తా, కాంగ్రెస్‌ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్‌, పీసీసీ సభ్యుడు మహ్మద్‌ యూసూఫ్‌, యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు పాల్గొన్నారు.

కిడ్నాప్‌ కథ సుఖాంతం

బాబును తల్లికి అప్పగించిన పోలీసులు



బాబుతో తల్లి దుర్గమ్మ

అనంతగిరి: వికారాబాద్‌లో కిడ్నాప్‌కు గురైన చిన్నారి కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించి తల్లికి అప్పగించారు. వికారాబాద్‌ టౌన్‌ సీఐ శ్రీను తెలిపిన వివరాలు ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన టేకు దుర్గమ్మ 15 రోజులుగా వికారాబాద్‌ గరీబ్‌నగర్‌ కాలనీలో నివాసముంటోంది. అయితే, మంగళవారం రాత్రి 9:30 గంటల సమయంలో దుర్గమ్మ తన చిన్న కొడుకు ఈశ్వర్‌, 14 నెలల బాబుతో కలిసి నిద్రిస్తున్న సమయంలో బాబును దుండగులు ఎత్తుకెళ్లారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే రెండు బృందాలుగా ఏర్పడి బాబు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దుర్గమ్మ ఇంటి పక్కనే ఉన్న ముకురం గణేశ్‌ అనే వ్యక్తి కిడ్నాప్‌ చేసినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని.. బాబును తల్లికి అప్పగించారు. చిన్నారిని క్షేమంగా తీసుకువచ్చిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల గెలుపునకు కృషి

- బీఆర్‌టీయూ నేత కృష్ణయ్య

అనంతగిరి: జిల్లాలోని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని బీఆర్‌టీయూ (భారత రాష్ట్ర ట్రేడ్‌ యూనియన్‌) జిల్లా అధ్యక్షుడు భూమేశ్ల కృష్ణయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బీఆర్‌ఎస్‌ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు నడుచుకుంటానన్నారు. కేటీఆర్‌, ఎంపీ రంజిత్‌ రెడ్డి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని చెప్పారు. ఆనంద్‌ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్మికులతో కలిసి ప్రచారం చేస్తామన్నారు. పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి. ప్రధాన కార్యదర్శి సురేష్‌, ఉన్నారు.

ధరణితో బూర్గుగడ్డ భూములు మాయం

- ఎమ్మెల్యే ఆనంద్‌కు విన్నవించిన రైతులు

ధారూరు: మూడు తరాల నుంచి సాగులో ఉన్నాం.. మా భూముల్ని మాకు తెలియకుండానే వేరేవాళ్లు రిజిస్ట్రేషన్‌ చేయించుకున్నారని బూర్గుగడ్డ రైతులు ఎమ్మెల్యే ఆనంద్‌కు విన్నవించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన నాగసమందర్‌ గ్రామానికి వెళ్లారు. దీంతో రైతులు ఆనంద్‌ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 120 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను ధరణి వల్ల ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించారని ఎమ్మెల్యే ఎదుట వారు వాపోయారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన భూములను బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడు భూములను లాక్కుంటే పర్వాలేదు. సాగులో ఉన్న భూములను లాకుంటే ఎలా వారు ప్రశ్నించారు. మూడు తరాలు మారాయి. ఇప్పుడు మీ బీఆర్‌ఎస్‌ నాయకులు లాక్కున్నారని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, ఎస్సీల భూములను కూడా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించారని వారు గుర్తు చేశారు. ఎమ్మెల్యే సమక్షంలో స్థానిక బీఆర్‌ఎస్‌ నేతలను మహిళలు దూషించారు.

హైవే పనులు ప్రారంభం

- కొడంగల్‌ శివారులో బైపాస్‌కు మార్కింగ్‌
- తాండూరు వద్ద కొనసాగుతున్న రహదారి విస్తరణ

కొడంగల్‌: వికారాబాద్‌ జిల్లా పరిధిలోని మహబూబ్‌నగర్‌– చించోలి జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయి. జిల్లా సరిహద్దు నుంచి కొడంగల్‌ మీదుగా పనులు ప్రారంభించారు. కొడంగల్‌ పట్టణ శివారు నుంచి తాండూరు రోడ్డు వరకు నిర్మించాల్సిన బైపాస్‌ రహదారికి మార్కింగ్‌ ఇచ్చారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని నిర్మాణ సంస్థ సిబ్బంది తెలిపారు. మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రం నుంచి కర్ణాటక రాష్ట్రం చించోలి వరకు జాతీయ రహదారి మంజూరైంది. దీనికి 167 ఎన్‌హెచ్‌గా పేరు పెట్టారు. మహబూబ్‌నగర్‌ నుంచి హన్వాడ, గండీడ్‌, కోస్గి, కొడంగల్‌, తాండూరు మీదుగా ఈ రహదారిని నిర్మిస్తారు. బెంగళూరు ముంబై జాతీయ రహదారులను కలిపే ఈ మార్గం 150 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. వికారాబాద్‌ జిల్లాలో 45 కిలోమీటర్లు, కర్ణాటక రాష్ట్రంలో 50 కిలోమీటర్లు, నారాయణపేట, మహబూబ్‌నగర్‌ జిల్లా పరిధిలో 55 కిలోమీటర్ల మేర విస్తరిస్తుంది. జాతీయ రహదారి నిర్మాణం వల్ల వికారాబాద్‌, నారాయణపేట, జిల్లాల పరిధిలోని గ్రామా లు అభివృద్ధి చెందుతాయి. రవాణా వ్యవస్థ మెరుగు పడుతుంది.



తాండూరు రోడ్డులో జరుగుతున్న పనులు

కాంగ్రెస్‌ పార్టీని నమ్మి మోసపోవద్దు



ధారూరు: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



తొర్మామిడిలో మాట్లాడుతున్న ఎంపీపీ రంజిత్‌రెడ్డి

యాలాల: కాంగ్రెస్‌ పార్టీని నమ్మి మోసపోవద్దని, ఆ పార్టీకి ఓటు వేస్తే ప్రజలందరూ గోసపడక తప్పదని వికారాబాద్‌ జెడ్పీటీసీ, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తల్లి ప్రమోదిని అన్నారు. బుధవారం మండలంలోని కోకట్‌ గ్రామంలో మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, ఏఎంసీ మాజీ చైర్మన్‌ విఠల్‌నాయక్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ రైతులు, పేద ప్రజల పక్షపాతి అని అన్నారు. రాష్ట్రంలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు ఎక్కడ లేవన్నారు. తాండూరును అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న రోహిత్‌రెడ్డికి మరోమారు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోను చూపుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ శంకర్‌, మండల కోఆప్షన్‌ సభ్యుడు అక్బర్‌బాబా, ఇన్‌చార్జి సర్పంచ్‌ కృష్ణ ఉన్నారు.

ఇంటింటి ప్రచారం

ధారూరు: మండలంలోని ఆయా వార్డుల్లో బుధవారం బీఆర్‌ఎస్‌ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వికారాబాద్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి డాక్టర్‌ మెతుకు ఆనంద్‌కు ఓటు వేసి గెలపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు చంద్రమౌళి, మండల మాజీ కోఆప్షన్‌ సభ్యుడు హఫీజ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు చిన్నయ్యగౌడ్‌, రహమతుల్లాఖాన్‌, రాములుగౌడ్‌ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఆదరించాలి

కొడంగల్‌ : బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆదరించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. బుధవారం మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రచారంలో భారంగా అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం, ఆలేడు, పెద్దనందిగామ, చిన్ననందిగామ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కుమార్‌ గెలిస్తేనే అభివృద్ధి

వికారాబాద్‌ అర్బన్‌: నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిస్తేనే వికారాబాద్‌ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ రమేశ్‌కుమార్‌ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని ఆలంపల్లి, ధన్నారం వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుకు ఓటు వేసి ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో పార్టీ సీనియర్‌ నాయకులు సత్యనారాయణ, కిషన్‌నాయక్‌, రత్నారెడ్డి, రాంచంద్రారెడ్డి, రెడ్యానాయక్‌, ముక్తార్‌ షరీప్‌, కౌన్సిలర్‌ చందర్‌ నాయక్‌, సర్వరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తా

ధారూరు: గత శాసనసభ ఎన్నికల్లో నన్ను మొదటిసారి గెలిపించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు నిత్యం మీతోనే ఉన్నానని, మరోసారి గెలిపిస్తే మీసేవ చేస్తూ ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నాయకులతో కలిసి ధారూరు మండలంలోని అల్లాపూర్‌, నాగసమందర్‌, రాంపూర్‌ తండా, పీసీఎంతండా, అంపల్లి, గురుదోట్ల, ఆరంపూర్‌తండాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజలకు ఏం చేయలేని కాంగ్రెస్‌ వాళ్లు ఓట్ల కోసం వస్తే ఓటుతోనే సమాధానం చెప్పాలని ఆయన సూచించారు.

రాంపూర్‌తండాలో..

రాంపూర్‌తండాలో ప్రచారం చేస్తుండగా నిజాం కాలం నుంచి సాగు చేసుకుంటున్న మా భూములను ఇటీవల రెండు కంపెనీలకు రిజిస్ట్రేషన్‌ అయ్యాయని ఆ గ్రామ గిరిజన రైతులు వాపోయారు. మన తండాలో మనరాజ్యం అని సీఎం కేసీఆర్‌ గ్రామ పంచాయతీగా చేశారని, అందుకే సీఎంకు రుణపడి కారు గుర్తుకు ఓటేసి నన్ను రెండోసారి ఎమ్మెల్యే గెలిపించాలని ఆయన కోరారు. ఎన్నికలు అయ్యాక మీ సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఆనంద్‌ హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో జెడ్పీటీసీ సుజాత, నాయకులు రాజునాయక్‌, వేణుగోపాల్‌ రెడ్డి, సంతోష్‌కుమార్‌, వెంకటయ్య, విజయకుమార్‌, రవినాయక్‌, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆనంద్‌ను మరోసారి గెలిపించండి

బంట్వారం: బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మెతుకు ఆనంద్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని చేవేళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే ఆనంద్‌తో కలిసి బంట్వారం మండలంలోని తొర్మామిడిలో ప్రచారం నిర్వహించారు.



యాలాల: ప్రచారం నిర్వహిస్తున్న ప్రమోదిని



కొడంగల్‌ : ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కాంగ్రెస్‌కే తాండూరు ప్రజలు పట్టం



కాంగ్రెస్‌లో చేరుతున్న హమాలి కార్మికులు

- మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ సునితసంపత్‌

తాండూరు: ప్రజలు కాంగ్రెస్‌ పార్టీని నమ్ముతున్నారని తాండూరు మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ సునిత సంపత్‌ అన్నారు. బుధవారం తాండూరు మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్‌ ఆధ్వర్యంలో 70 మంది హమాలీ కార్మికులు సునితాసంపత్‌ సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాండూరు కాంగ్రెస్‌ పార్టీ కంచుకోటలాంటిదన్నారు. తాండూరు ప్రాంత ప్రజలు కాంగ్రెస్‌పార్టీ వైపు ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌ అభ్యర్థి మనోహర్‌రెడ్డి 20 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్‌ సంపత్‌కుమార్‌, కార్మిక సంఘంనాయకులు, హమాలి కార్మికులు తదితరులున్నారు.